సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 5 । అక్టోబర్ । 2024



సీట్లు తగ్గించాల్సిందే

ట్రిపుల్ ఐటీలో సీట్లు తగ్గించాలని చూస్తున్నారు. అదే జరిగితే పేద విద్యార్థులకు నష్టమే.

- 6లో



దసరాకు ప్రత్యేక బస్సులు

దసరాకు ప్రత్యేక బస్సులు నడవనున్నారు. సాధారణ చార్జీలే వసూలు చేస్తారు.

- 6లో

ఉపాధ్యాయులకు షోకాజ్ జారీ

రణస్థలం: పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సీహెచ్ చెన్నా కుమార్‌ను ఈ నెల 1వ తేదీన టీచర్ కర్రతో కొట్టడం వల్ల కంటికి గాయమైన సంగతి తెలిసిందే. విద్యార్థికి విశాఖపట్నంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేసి, ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ ప్రమాదానికి కారణమైన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.శోభారాణి, తెలుగు ఉపాధ్యాయుడు ఎన్. అరుణ్ కుమార్‌లకు జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

నాయకుల మాట

న్యాయస్థానం కళ్లు కప్పలేరు



టీడీపీ కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది. లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు చేసిన తప్పుల్ని ఎత్తిచూపుతూ సుప్రీం కోర్టు వెల్లడించిన అంశాలు ప్రభుత్వానికి చెంపపెట్టు. న్యాయస్థానం కళ్లు కప్పలేరు. సీబీఐ డైరెక్టర్ నేతృత్వంలో సిట్ ఏర్పాటుతో నిజానిజాలు నిగ్గుతేలుతాయి.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ

సిట్ ఏర్పాటు హర్షణీయం



తిరుపతి లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సిట్ ఏర్పాటు హర్షణీయం. చంద్రబాబుకు ఈ తీర్పు తగిన గుణపాఠం. ఇప్పటికైనా ఎన్నికల ముందు ఇచ్చిన హామీల కోసం ఆలోచించాలి.

– దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ

గుణపాఠం కావాలి



సుప్రీం నిర్ణయంతో చంద్రబాబుకు గుణపాఠం కావాలి. ఎన్నికల హామీల నుంచి తప్పించుకోవడానికి కలియుగ దైవం ప్రసాదంపై లేని పోని దుష్ప్రచారాలు చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బ తీశారు.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టెక్కలి

దేవుడితో ఆటలా..



కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామితో కూటమి నాయకులు ఆటలాడుతున్నారు. వెంకన్న స్వామే సరైన సమయంలో వారికి సమాధానం చెబుతారు. దేవుడిని సైతం రాజకీయాలకు వాడుకునే వక్ర బుద్ధి చంద్రబాబుకు మాత్రమే ఉంది.

– గొర్లె కిరణ్ కుమార్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే





సత్యమేవ జయతే.. సత్యమే గెలుస్తోంది. అబద్ధాలతో ఇటుకలు పేర్చి విపక్షాన్ని సమాధి చేయాలనుకున్న గోబెల్స్ వారసుల క్షుద్ర ఆలోచన పటాపంచలైంది. ఆకాశమే హద్దుగా సాగిన అసత్యపు ప్రచారాలకు, దేవుడిని అపహాస్యం చేస్తూ సాగిన దీక్షలకు సుప్రీం కోర్టు అడ్డుకట్ట వేసింది. లడ్డూ ప్రసాదంపై పాలకుల కుట్రలు, వారి వందిమాగధుల ఆర్భాటాలు అన్నింటినీ అత్యున్నత న్యాయస్థానం ఒకే ఒక నిర్ణయంతో తిప్పికొట్టింది. ఈ వివాదంపై స్వతంత్రసిట్‌కు సుప్రీం ఆదేశించడంపై జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

లడ్డూ కట్టుకథలకు అడ్డుకట్ట

- తిరుమల లడ్డూ వ్యవహారంలో సుప్రీం తీర్పుపై సర్వత్రా హర్షం
- పాలకులకు చెంప పెట్టు అని మేధావుల వ్యాఖ్య



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ సామాన్యులకు కూడా తెలిసిపోయింది. 100 రోజుల పాలనపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను మళ్లించేందుకు రకరకాల డ్రామాలాడుతున్న వైనం దేవుడి సాక్షిగా బట్టబయలైంది. తమ వైఫల్యాలు కప్పి పుచ్చుకునేందుకు తిరుమల లడ్డూ అంశాన్ని తెరపైకి తెచ్చి భక్తుల మనోభావాలతో అడ్డుకుని డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారు. అటు చంద్రబాబు, ఇటు పవన్ కళ్యాణ్ చేసిన దుష్ప్రచారంతో ఏదో జరిగిపోయిందనే అనుమానాలు కలిగించారు. కానీ వీరికి దేశ అత్యున్నత స్థానం మొట్టికాయలు వేసింది. అసత్యాలు, దుష్ప్రచారంతో ప్రజల్ని మోసగించిన కూటమి నేతలకు చెంపపెట్టులాంటి తీర్పును వెల్లడించింది. లడ్డూ వ్యవహారాన్ని తన సిట్‌తో చుట్టేయాలని చూసిన చంద్రబాబుకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్‌ను రద్దు చేసి సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఐదుగురు సభ్యులతో స్వతంత్ర సిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతో లడ్డూపై తప్పుడు ప్రచారం చేసి అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబుకు సుప్రీంకోర్టు సిట్ ఏర్పాటు చేయడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

చంద్రబాబు మోసాలివి..

- లడ్డూ వివాదంపై రోజుకో ప్రకటన ఇచ్చిన చంద్రబాబు ఖరీఫ్ ప్రారంభమై ఇన్నాళ్లయినా రైతులకు అవసరమైన సాయంపై ఒక్క మాట మాట్లాడలేదు. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ ప్రారంభంలోనే ఎరువులు, విత్తనాలు నేరుగా సరఫరా చేయడమే కాకుండా సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించింది. కానీ, ఈ ప్రభుత్వం విత్తనాల దగ్గరి నుంచి ఎరువుల వరకు మొండిచేయి చూపింది.
- ఉచిత ఇసుక అని ప్రకటించి ఇష్టానుసారం తమ నాయకులకు రీచ్‌లకు రీచ్‌లు రాసిచ్చేశారు. దీంతో సామాన్యుడికి ఇసుక దొరకడమే గగనమైపోయింది.
- 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పి.. నెలలు గడుస్తున్న కొద్దీ పింఛన్‌దారుల సంఖ్యను తగ్గించేస్తున్నారు. తమ పార్టీకి ఓటేయలేదనో, వైఎస్సార్ సీపీ సానుభూతి పరులనో కక్ష పెట్టుకుని అన్యాయంగా పింఛన్లు ఆపేస్తున్నారు. ఇప్పటివరకు 4వేలకు పైగా పింఛన్లు తీసేశారు.
- విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మెల్లగా అమ్మేయడానికి కేంద్రం చూస్తుంటే.. దాన్ని ఆపే పనైనా చేయడం లేదు. ప్రైవేటీకరణకు అడుగులు పడుతున్నా కనీసం మాట్లాడటం లేదు.
- నిరుద్యోగ భృతి అని హామీ ఇచ్చిన విషయం గుర్తు లేనట్టే ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఎన్నికల్లో గెలిచాక దీనిపై ఒక్కటంటే ఒక్క ప్రకటన కూడా చేయలేదు.
- బడులు ప్రారంభమై నాలుగు నెలలవుతున్నా తల్లికి వందనం వేయనేలేదు. పైగా ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని ఇంటింటికీ వెళ్లి చెప్పారు. కానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి విడుదల చేయలేదు.
- ఆర్టీసీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఎలాంటి పురోగతి లేదు. 19 నుంచి 60ఏళ్ల లోపు మహిళలకు నెలకి రూ.1500 ఇస్తామని చెప్పారు. దాని కోసం ప్రస్తుతం కనీసం మాట్లాడటం లేదు.

ప్రజల దృష్టి మరల్చేందుకే..



వంద రోజుల పాలనలో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేక పోయింది. ప్రజల దృష్టి మరల్చేందుకు ఈ లడ్డూ వివాదాన్ని రేపింది. చంద్రబాబుకు నీతి, నిజాయితీ, చిత్తశుద్ధి లేకుండా పోయింది. కుర్చీ కోసం ఎంతటి తప్పుడు ప్రచారం అయినా చేస్తారు.

– రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం

చంద్రబాబుకు భంగపాటు



ఎన్నికల ముందు ఇచ్చిన హామీల నుంచి తప్పించుకోవడానికి సీఎం చంద్రబాబు కల్తీ నెయ్యి వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చారు. ఇప్పుడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో చంద్రబాబుకు భంగపాటు జరిగింది. ఇప్పటికైనా జరిగిన కుట్రలను భక్తులు తెలుసుకోవాలి. – ఎస్.ఉషారాణి, సమరసత సేవా ఫౌండేషన్ మహిళా ప్రతినిధి, టెక్కలి

సుప్రీంకోర్టు నిర్ణయం కరెక్ట్



తిరుమల ప్రసాదాన్ని రాజకీయాలకు వాడుకోవడం శోచనీయం. ప్రజల దృష్టిని మళ్లించేందుకు కల్తీ లడ్డూ వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చారు. ఈ వ్యవహారంలో మొదటి నుంచీ తమ తప్పు లేదని టీటీడీ బోర్డు చైర్మన్లుగా పనిచేసిన వారు స్పష్టం చేస్తూ వచ్చారు.

– సదాశివుని ప్రభాకరరావు, విశ్రాంత తహసీల్దార్, నరసన్నపేట

నిజం నిగ్గు తేలాలి



తిరుపతి లడ్డూలో కల్తీ జరగలేదని టీటీడీ ఈఓ, కల్తీ జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యంలో నిజం నిగ్గు తేలాల్సి ఉంది. దర్యాప్తు బృందంలో సుప్రీం కోర్టు సీబీఐను చేర్చడం సముచితం. – ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, బీఆర్‌ఏయూ పూర్వపు వీసీ

దోషులను శిక్షించాలి



తిరుపతి లడ్డూ కల్తీపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కమిటీని ఆహ్వానిస్తున్నాం.

– సీహెచ్ గణపతిస్వామి, వీహెచ్‌పీ కార్యదర్శి

వారి మనసుల్లోనే కల్తీ ఉంది



తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ ఉందని ప్రచారం చేసిన కూటమి నాయకుల మనస్సుల్లోనే అసలైన కల్తీ ఉంది. ఈ రోజు అత్యున్నత న్యాయస్థానం మొట్టికాయలు వేసిన తర్వాత కూడా సిగ్గు లేకుండా చంద్రబాబు అండ్ కో చేస్తున్న ప్రచారంపై దేవదేవుడే సరైన సమయంలో తగిన శిక్ష విధిస్తాడు.

– ధర్మాన కృష్ణదాస్, మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

బాబుకు మంచి బుద్ధి రావాలి



చంద్రబాబుకు వేంకటేశ్వరుడు మంచి బుద్ధి ప్రసాదించాలి. వంద రోజుల పాలన వైఫల్యాలపై ప్రజల దృష్టి మరల్చేందుకు కల్తీ నెయ్యి అంశాన్ని ప్రచారం చేశారు. సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసినా వారిలో మార్పు కనిపించడం లేదు. – తమ్మినేని సీతారాం, మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటరీ పరిశీలకుడు

చంద్రబాబుకు చెంపపెట్టు



సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు. చంద్రబాబు తన జీవితమంతా వికృత చేష్టలతోనే రాణించారు. మీడియా, పచ్చపత్రికలతో తప్పుడు ప్రచారాలు చేయించడం ఆయనకు వెన్నతోపెట్టి విద్య.

– డాక్టర్ సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

కేంద్రం జోక్యం చేసుకోవాలి..



తిరుపతి లడ్డూ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్‌ను రద్దు చేయడం గమనార్హం. కొత్త సిట్‌లో ఇద్దరు రాష్ట్ర పోలీసుశాఖ అధికారులకు బదులుగా కేంద్రప్రభుత్వ అధికారులనే నియమిస్తే బాగుంటుంది.

– పిరియా విజయ, జెడ్పీ చైర్ పర్సన్, శ్రీకాకుళం

కొత్తమ్మ తల్లి జాతర ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కింపు చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: కొత్తమ్మ తల్లి జాతర ఆదాయాన్ని శుక్రవారం దేవదాయ శాఖ డిప్యూటీ కమినర్ వై.భద్రాద్రి, అసిస్టెంట్ కమిషనర్ బీఆర్‌వీవీ ప్రసాద్ పట్నాయక్ పర్యవేక్షణలో లెక్కించారు. హుండీలు, ప్రత్యేక దర్శనం టిక్కెట్లు, మొక్కుబడి టిక్కెట్ల ద్వారా మొత్తం రూ.18,21,517 ఆదాయం వచ్చినట్లు ఈఓ వి.రాధాకృష్ణ తెలిపారు. గత ఏడాది రూ.20,12,242 ఆదా యం వచ్చిందని, గత ఏడాది కంటే రూ.1,90,725 తక్కువ ఆదాయం సమకూరిందని తెలిపారు.

రైతులకు కేంద్రం శుభవార్త

హిరమండలం: పంట పెట్టుబడి సాయం కింద శనివారం కేంద్ర ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.2వేలు విడుదల చేయనుందని వ్యవసాయశాఖ జేడీఏ శ్రీధర్ తెలిపారు. ఈ ఏడాది రెండో విడతగా సాయం అందిస్తున్నారు. జిల్లాలో అర్హత కలిగిన 2,29,345 మంది రైతుల ఖాతాల్లోకి రూ.45.86కోట్లు నేరుగా జమ చేయనున్నట్లు తెలిపారు. తొలి విడతగా జూన్18న రైతు ఖాతాల్లో జమ చేశారని తెలిపారు.

బాబూ.. రైతులు గుర్తున్నారా?

కేంద్ర సాయం అందుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వ సాయంపై మాత్రం ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదు. ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామని గొప్పలు చెప్పిన చంద్రబాబు ఇప్పటి వరకు దాని ఊసెత్తలేదు. చంద్రబాబు సర్కార్ నిర్లక్ష్య వైఖరిని రైతులు, రైతు సంఘాల నాయకులు, విపక్షాలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి. వైఎస్ జగన్ హయాంలో ఠంచనుగా రైతు భరోసా సాయం అందేది.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు పుష్పలత



శ్రీకాకుళం న్యూకాలనీ/నరసన్నపేట : ఆలిండియా మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు జిల్లాకు చెందిన రుప్ప పుష్పలత ఎంపికైంది. ఢిల్లీలోని నోయిడా వేదికగా ఈనెల 10 నుంచి ఈ ఫుట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. పు ష్పలత స్వస్థలం నరసన్నపేట సమీపంలోని జమ్ము గ్రామం. అక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఎన్‌సీసీ క్యాడెట్‌గా కూడా విశేషమైన ప్రతిభతో ఆకట్టుకుంటోంది. తల్లిదండ్రులు రుప్ప అప్పలస్వామి, సుశీల. జాతీయ జట్టుకు ఎంపికపై క్రీడాకారిణిని పలువురు అభినందించారు.

రైల్వే చోరీ కేసులో ట్విస్ట్



- ఓ మంత్రి జోక్యం
- రాజకీయ ఒత్తిళ్లతో కేసును నీరుగార్చే యత్నం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఇటీవల శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధిలో తిలారు వద్ద జరిగిన రైల్వే సొత్తు చోరీ కేసులో రాజకీయం జోక్యం చేసుకుంది. కేసును నీరుగార్చేందుకు ఓ మంత్రి రంగంలోకి దిగారన్న వాదనలు వినిపిస్తున్నాయి. కేసు ముదరకుండా, తేలికపాటి చర్యలతో ముగించేయాలని సంబంధిత అధికారులపై ఒత్తిడి చేసినట్టు తెలిసింది. ఇప్పుడిది చర్చనీయాంశమైంది. తిలారు స్టేషన్ సమీపంలో రైల్వే కమ్ములు చోరీకి గురయ్యాయి. చోరీకి సంబంధించి కిడిమి గ్రామస్తులు అక్టోబర్ 1వ తేదీన నౌపడ పోలీసులకు, ఆర్పీఎఫ్‌కు ఫిర్యాదు చేయగా అక్టోబర్ 2న నౌపడ పోలీసులు, రైల్వే పోలీసులు వచ్చి చోరీ చేసిన కమ్ములను స్వాధీనం చేసుకున్నారు. చోరీకి పాల్పడిన కోటబొమ్మాళి మండలం కిష్టపురం సచివాలయం సర్వేయర్ మహేంద్ర దాస్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆ వ్యక్తిని పూర్తి స్థాయిలో విచారించకుండా స్టేషన్ బెయిల్‌తో విడిచిపెట్టి నామమాత్రపు దర్యాప్తు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవంగా 40అడుగులు, 20 అడుగుల ఐరన్ కమ్ములు చోరీకి గురయ్యాయి. ఒక్కో కమ్మి బరువు 52 కిలోల నుంచి 60 కిలోల వరకు ఉంటుంది. ఇలాంటి ఎన్ని కమ్ములు చోరీకి గురయ్యాయన్న దానిపై స్పష్టత లేదు. ఆ కమ్ములు దాచి ఉంచిన వ్యక్తిని వారి ఇంటి వద్దే పట్టుకున్నారు. అయితే, ఇంత బరువైన కమ్ములను ఒక్కరే పట్టుకుని వెళ్లడం కష్టం. ఇందులో మరికొంతమంది ప్రమేయం తప్పకుండా ఉంటుంది. కానీ చోరీకి పాల్పడిన మహేంద్రదాస్‌పై తేలికపాటి సెక్షన్‌లు నమోదు చేసినట్టు సమాచారం. వాస్తవంగా రైల్వే సొత్తు చోరీపై సమగ్ర విచారణ జరగాలి. ఇందులో ఎంతమంది ప్రమేయం ఉంటే వారందరినీ పట్టుకోవాలి. అంతేకాకుండా రైల్వే సొత్తు చోరీకి గురైతే సీరియస్ సెక్షన్లు నమోదవుతాయి. కానీ ఇక్కడ అలా జరగలేదని, ఓ మంత్రి ఒత్తిళ్లతో నామమాత్రపు సెక్షన్లు పెట్టి నిందితుడికి మేలు చేసినట్టు విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారం రైల్వే శాఖలోనే కాదు టెక్కలి, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల్లో కూడా చర్చనీయాంశమైంది.

7 నుంచి 12 వరకు వర్సిటీకి దసరా సెలవులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి ఈ నెల 7వ తేదీ నుంచి 12 వరకు సెలవులు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ పి.సుజాత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ నుంచి క్లాస్ వర్క్ జరగనుందని అన్నారు. టీచింగ్ సిబ్బంది, విద్యార్థులకు సెలవులు వర్తిస్తాయని తెలిపారు.

● అమ్మకు పసుపు కొమ్ము



దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో తల్లిని పలు రూపాల్లో అలంకరిస్తున్నారు. శ్రీకాకుళం బ్రిడ్జి రోడ్డులో ఉన్న అమ్మవారి ఆలయంలో దుర్గమ్మను పసుపు కొమ్ములతో అలంకరించారు. - శ్రీకాకుళం కల్చరల్

క్లుప్తంగా

తపాలా అధికారుల వేధింపులపై నిరసన


పోస్టుకార్డులతో తపాలాశాఖ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల నిరసన

శ్రీకాకుళం అర్బన్: ఆచరణ సాధ్యం కాని టార్గెట్లు, ఆన్‌లైన్ ట్రైనింగ్ కోర్సుల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు చేస్తున్న వేధింపులను వెంటనే ఆపాలని తపాలా శాఖ ఉద్యోగుల సంఘ ప్రతినిధి గణపతి డిమాండ్ చేశారు. తపాలా ఉద్యోగుల వేధింపులకు వ్యతిరేకంగా ఎన్ఎఫ్‌పీఈ రాష్ట్ర సమన్వయ కమిటీ, ఏఐజీడీఎస్‌యూ రాష్ట్ర సంఘాల ఆధ్వర్యంలో మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళంలోని తపాలాశాఖ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టార్గెట్ల పేరుతో అధికారుల వేధింపులు ఆపాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా తపాలా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి పోస్టు కార్డుల ద్వారా ఈమెయిల్స్ ద్వారా తపాలాశాఖ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్‌కు విన్నవించుకున్నామన్నారు.

జిల్లా అటవీ శాఖాధికారిగా వెంకటేష్

అరసవల్లి: జిల్లా అటవీ శాఖాధికారిగా ఐఎఫ్ఎస్ అధికారి ఎస్.వెంకటేష్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం విజయనగరం జిల్లా అటవీ శాఖాధికారిగా పనిచేస్తూ ప్రస్తుతానికి స్థానిక జిల్లా డీఎఫ్ఓగా ఇన్‌ఛార్జి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కూడా వెంకటేష్ ఆదేశాల ప్రకారమే అధిక శాతం సిబ్బందికి బదిలీలు జరిగాయన్న సంగతి తెలిసిందే.

ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్‌కు దసరా సెలవులు ఇవ్వాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ నిబంధనలు కనీసం పట్టించుకోకుండా విద్యార్థులతోపాటు ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ హక్కులను కాలరాస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగు మన్మధరావు, జిల్లా అధ్యక్షులు రాగోలు నాగశివ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాయికర్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. దసరా సెలవుల్లో బడులు, కాలేజీలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, లెక్చరర్ల మాదిరిగానే ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లు, లెక్చరర్లకు సెలవులు మంజూరు చేయాలని కోరారు.

బీఆర్ఏయూలో ఎంబీఏ, ఎంసీఏలో స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 7వ తేదీ వరకు పనిదినాల్లో ఎంబీఏ, ఎంసీఏ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ పి.సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మిగులు సీట్లకు విద్యార్హత ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఐసెట్-2024లో ఉత్తీర్ణత తప్పనిసరని వివరించారు. స్పాట్ అడ్మిషన్లు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ వంటి ప్రభుత్వ రాయితీలు వర్తించబోవని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, జిరాక్సు సెట్‌లతో హాజరు కావాలని సూచించారు.

6, 7 తేదీల్లో రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 6, 7 తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్-19 మహిళల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు, స్థానిక పాఠశాల పీడీ మొజ్జాడ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. శ్రీకాకుళం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

108 వాహనంలో ప్రసవం

జి.సిగడాం: మండలంలోని జగన్నాథవలస గ్రామానికి చెందిన ఇజ్జి ఉమాకు శుక్రవారం ఉదయం 3 గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వాహనంలో బాతువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా దారిలోనే ఆమెకు నొప్పులు అధికమై వాహనంలోనే ప్రసవం జరిగింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని జి.సిగడాం ఈఎంటీ సతీష్‌కుమార్, పీఐ శ్రీనివాసరావు, ఎంఎల్‌ఎహెచ్‌పీ కింజరాపు అనుషా, ఆశా కార్యకర్త నాగమణి తెలిపారు.

పశువులు తరలిస్తున్న వాహనం స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం బైపాస్ కూడలి సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం కబేళాలకు తరలిస్తున్న పశువుల కంటైనర్ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 55 గేదెలను విజయనగరం జిల్లాలోని కొత్తవలస గోశాలకు తరలించారు. వాహనం సీజ్ చేశారు. డ్రైవర్‌కు స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. జాతీయ రహదారిపై నిరంతరం వాహన తనిఖీలు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

● శ్రామిక సోదరా.. మీ సేవకు సలామ్



టెక్కలి మేజర్ పంచాయతీలో శుక్రవారం ఓ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు తన వృత్తి పట్ల చూపిన నిబద్ధత అందరినీ ఆలోచింపజేసింది. మురుగు కాలువలో మురుగు నీరు నిల్వగా చేరిపోవడంతో ఆ నీటిని మళ్లించేందుకు ఇలా తన చేతిని కాలువలో పెట్టి నీటిని మళ్లించారు. ఇది చూసిన స్థానికులు కార్మికుడి సేవకు సలామ్ కొట్టారు. - టెక్కలి

సీట్లు తగ్గించాల్సిందే

- శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీట్ల తగ్గింపునకు సిఫార్సు
- సగం వరకు సీట్లు తగ్గించాలని త్రిసభ్య కమిటీ సూచన

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో సీట్లు తగ్గించాలని త్రిసభ్య కమిటీ సూచిస్తోంది. ఇక్కడ ప్రస్తుతం 1100 సీట్లు ఉండగా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి 550 సీట్లకు తగ్గించాలని త్రిసభ్య కమిటీ సిఫార్సు చేసింది. నూజివీడు ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లో 45 రోజుల కిందట నాసిరకం భోజనం, మెస్, కిచెన్‌లో పారిశుద్ధ్య లోపంతో వందలాదిమంది అనారోగ్యానికి గురయ్యారు. ఇదే క్యాంపస్‌లో శ్రీకాకుళం క్యాంపస్‌కు చెందిన ఇంజినీరింగ్ మూడు, నాలుగేళ్ల విద్యార్థులు చదువుతున్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లో తీసుకోవాల్సిన చర్యలపై విద్యాశాఖ త్రిసభ్య కమిటీ వేసింది. ఈ కమిటీలో కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ రామ్మోహన్‌రావు, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఉన్నారు. అయితే నూజివీడు ఆర్‌జీయూకేటీ సమస్యతో పాటు, ప్రస్తుతం శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లో సగం సీట్లు తగ్గించాలని, 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని సిఫార్సు చేయటం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్ 2016 అక్టోబర్ 9న ప్రారంభించారు. 2017-18 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు కల్పించారు. ప్రస్తుతం 4000 వేల మంది విద్యార్థులు స్థానికంగా చదువుతున్నారు. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్‌లో ప్రీ యూనివర్సిటీ మొదటి, రెండేళ్లు, ఇంజినీరింగ్ మొదటి రెండేళ్లు స్థానిక క్యాంపస్‌లో చదువుతుండగా, ఇంజినీరింగ్ మూడు, నాలుగేళ్ల పిల్లలు నూజివీడులో చదువుతున్నారు. మరో పక్క ప్రీ యూనివర్సిటీ (పీయూసీ) మొదటి, రెండేళ్ల బాలురు చిలకపాలేంలోని అద్దె క్యాంపస్ శివానీలో చదువుతున్నారు. ఇక్కడ మౌలిక వసతులే ప్రధాన సమస్య. ప్రస్తుతం నాలుగు వేల మంది విద్యార్థులు చదువుతున్నా ఈ సంఖ్యకు అనుగుణంగా వసతి గృహాలు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు లేవు. శ్రీకాకుళం క్యాంపస్‌లో ఫ్యాకల్టీ రిక్రూట్ మెంట్ సైతం జరగలేదు. కాంట్రాక్టు సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. మరో పక్క మౌలిక వసతుల కోసం నిధులు మంజూరు చేస్తే ఆరు నెలల్లో వసతులు కల్పించ వచ్చు.


శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ

వచ్చే విద్యా సంవత్సరం ప్రవేశాలు జూన్‌లో నిర్వహించే అవకాశం ఉంది. అంటే ఇప్పటి నుంచి నిర్మాణాలు ప్రారంభిస్తే వేల మందికి సరిపడా వసతి కల్పించవచ్చు. కానీ అలా చేయకుండా సీట్లు తగ్గించాలని ప్రభుత్వం చూస్తోంది. ఈ ఆర్‌జీయూకేటీల్లో చదువుతున్న వారు 90 శాతం మంది గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు. సీట్లు తగ్గించేస్తే వీరు ఉన్నత విద్యకు దూరమవుతారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీట్ల తగ్గింపుతో పాటు మెస్ టెండర్లు అర్హులకు ఇవ్వడం, బియ్యం, నిత్యావసర సరుకుల నాణ్యత పరిశీలించి మెస్ యాజమాన్య కమిటీలు కొనుగోలు చేయటం, బాలికల సంరక్షణ, భోజనం నాణ్యత పరిశీలించటం కోసం యాప్ అమలు, విద్యార్థులు యాప్‌లో ఫిర్యాదులు ఆధారంగా మార్పులు చేయటం వంటివి సైతం కమిటీ సిఫార్సు చేసింది. అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

- అందుబాటులో 360 సర్వీసులు
- సాధారణ చార్జీలే : డీపీటీఓ విజయ్‌కుమార్


శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్

శ్రీకాకుళం అర్బన్: దసరా సందర్భంగా ప్రయాణికుల అవసరాలకు తగినట్టుగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. గతంలో ఆర్టీసీ నడిపే ప్రత్యేక బస్సులమీద అదనపు చార్జీలు వసూలు చేసేవారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ విధానానికి స్వస్తి పలికి సాధారణ చార్జీలతోనే దసరా బస్సులు నడిపించారు. ఇప్పుడు అదే విధానాన్ని పాటించనున్నారు. జిల్లాలోని శ్రీకాకుళం ఒకటి, శ్రీకాకుళం రెండు డిపోలతో పాటు టెక్కలి, పలాస తదితర నాలుగు డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 333 బస్సులు తిరుగుతున్నాయి. ఇందులో 244 ఆర్టీసీ బస్సులు కాగా 89 హైర్ బస్సులు ఉన్నాయి. వీటికి అదనంగా ఒకటి, రెండు డిపోల పరిధిలో 8 బస్సులు, టెక్కలి, పలాస డిపోల పరిధిలో 5నుంచి 6 బస్సులు అదనంగా ఉండనున్నాయి. వీటిని కూడా ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా నడపనున్నారు.

దూర ప్రాంతాల కోసం..

దసరా సందర్భంగా వలస వెళ్లిన వారంతా జిల్లాకు వస్తారు. వీరి రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణ సమయంలో ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ఉండేందుకు ఆర్టీసీ అధికారులు అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. నాలుగు డిపోల్లో ఉన్న రెగ్యులర్ బస్సులతోపాటు అదనంగా ఒక్కో డిపో నుంచి 3 నుంచి 4 బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సులు ఆయా రోజుల్లో సుమారు 12 నుంచి 16 ట్రిప్పులు తిరుగనున్నాయి. ప్రస్తుతం రెగ్యులర్‌గా విజయవాడకు 7 షెడ్యూల్ బస్సులు, రాజమండ్రికి 6, అమలాపురానికి 2, రామచంద్రాపురానికి 2 బస్సులు, కొవ్వూరు, భద్రాచలంనకు ఒక్కొక్కటి చొప్పున నడుస్తున్నాయి. అలాగే శ్రీకాకుళం-విశాఖపట్టణం మధ్య నాన్‌స్టాప్ బస్సులు 26 షెడ్యూల్ బస్సులు తిరుగుతున్నాయి. ఈ బస్సులు ప్రతి 15 నిమిషాలకు ఒకటి చొప్పున తిరగనున్నాయి. ఇక హైదరాబాద్ నుంచి శ్రీకాకుళంనకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 4 బస్సులు నడుపుతున్నారు. అక్టోబరు 9వ తేదీన 2 బస్సులు, 10వ తేదీన 2 బస్సులు నడపనున్నారు. ఇక దూరప్రాంతం నుంచి జిల్లాకు చేరుకున్న ప్రయాణికుల కోసం కూడా ప్రత్యేకంగా బస్సులను నడపనున్నారు. జిల్లా కేంద్రం నుంచి కొత్తూరు, బత్తిలి, పాలకొండ, పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం రూట్లలో అధికంగా రద్దీ ఉంటుందని భావించి ఆయా రూట్లలో అదనపు బస్సులు నడపనున్నారు. ఈనెల 9వ తేదీ నుంచి ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని భావిస్తున్నారు. ఆయా రోజుల్లో రాత్రి 9గంటల నుంచి వేకువజామున 4గంటల వరకూ ప్రతి గంటకూ ఒక బస్సు చొప్పున నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. హైర్ బస్‌లను కూడా ఆర్టీసీ అధికారులు వినియోగించనున్నారు.

వినియోగించుకోవాలి



దసరా పండగ సందర్భంగా ఆర్టీసీ నడుపుతున్న ప్రత్యేక బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఏడాది ప్రయాణికులపై ఎటువంటి అదనపు భారం లేకుండా ఆర్టీసీ యాజమాన్యం చర్యలు తీసుకుంది.

– ఎ.విజయ్‌కుమార్, డీపీటీఓ

బాలల సంక్షేమంపై ఆరా

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాలల సంక్షేమం, పథకాల అమలులో ఎలాంటి అలసత్వం ఉండరాదని వంద శాతం వారి సంక్షేమం అమలు కావాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. డీఆర్‌డీఏ కాంప్లెక్సులోని సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతులశాఖ, స్త్రీ శిశు సంరక్షణ శాఖ అధికారులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. బాలల హక్కుల పరిరక్షణ, దివ్యాంగ బాలల పరిరక్షణ, వారికోసం అమలు చేస్తున్న సంక్షేమాలపై అడిగి తెలుసుకున్నారు.

విభిన్న ప్రతిభావంతులైన బాలలకు వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు, టాప్‌లు, ఇతర ఉపకరణాలు పారదర్శకంగా పంపిణీ చే యాలని తెలిపారు. దివ్యాంగుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కవిత మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సారథ్యంలో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.శాంతి శ్రీ, జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకట రమణ, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం

సీనియర్స్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సీనియర్స్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలను ఈనెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముని శ్రీనివాసరావు తెలిపారు. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు. ఫుట్‌బాల్ క్రీడాకారులు, ఫుట్‌బాల్ క్లబ్‌లు క్రీడాకారుల పేర్లు సీఆర్ఎస్ చేయించుకుని ఎంపిక పోటీలకు హాజరుకావాలన్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్టును విజయవాడలో జరగనున్న ఏపీఎఫ్ఏ సీనియర్స్ పురుషుల రాష్ట్రస్థాయి (అంతర్‌జిల్లా) ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీలకు పంపిస్తామని ముని శ్రీను పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సంయుక్త కార్యదర్శి కె.నవీన్ (73869 56065)ని సంప్రదించాలన్నారు.

రెవెన్యూ బదిలీలు పూర్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ శాఖలో బదిలీల పర్వం ఎట్టకేలకు పూర్తయ్యింది. శుక్రవారం వీఆర్‌ఓ, డిప్యూటీ తహసీల్దార్ బదిలీల జాబితాలు విడుదల చేశారు. ఈ విభాగాల్లో గతంలో ఎన్నడూ జరగనంత సంఖ్యలో ఈ సారి బదిలీలు జరిగాయి. దరఖాస్తు చేసుకున్న వారికి, చేయని వారికి కూడా బదిలీలు వచ్చాయి. గతంలో ఎప్పుడూ ఇంతగా నిబంధనలు అతిక్రమించలేదని ఉద్యోగులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. బదిలీల జాబితాలు బయటకు వచ్చినా ఇంకా చాలా మంది సర్దుబాటు చేయడానికి చూస్తున్నారు. రాజకీయ పైరవీలు, కలెక్టరేట్ ఎ సెక్షన్ సిబ్బంది పైరవీలు చూసుకుని డీటీ, వీఆర్‌ఓ కేడర్ల వారికి వ్యక్తిగత ఉత్తర్వులు ఇవ్వడం శుక్రవారం జరిగింది. ఈ మార్పులు బయటకు రాకుండా ఎ సెక్షన్ సిబ్బంది జాగ్రత్తలు పడుతున్నారు. తహసీల్దారు కేడర్లలో కూడా సర్దుబాట్లకు డిప్యూటేషన్ పేరిట ఇద్దరు ముగ్గురు ప్రయత్నాలు చేస్తున్నారు.

మామిడా.. మజాకా

పాతపట్నం ఎమ్మెల్యే ఫోన్ వస్తే కలెక్టరేట్‌లో అన్ని స్థాయిల ఉద్యోగులు బెదిరిపోతున్నారు. ఆయన నియోజకవర్గంలో ఎవరి పేర్లు చెబుతారో అని భయపడుతున్నారు. అందరి కంటే ముందుగా సిఫార్సు లేఖలు ఇచ్చిన జాబితాలో పాతపట్నం ఎమ్మెల్యే ఉన్నారు. అదే తరహాలో ఎక్కువ లేఖలు ఇచ్చిన వారిలోనూ ఆయనే ముందంజలో ఉన్నారు. ప్రతి చిన్న పనికీ కలెక్టర్, జేసీలకు ఫోన్లు చేస్తుండడం అధికారులకు తలనొప్పిగా మారింది. ఇటీవల జిల్లాలో 15 మంది తహసీల్దార్లను బదిలీలు చేశారు. వీరిలో కలెక్టరేట్ హెచ్ సెక్షన్‌కి ఉత్తర్వుల్లో ఈశ్వరమ్మని నియమించారు. ఆమె విధుల్లో చేరకుండా పాతపట్నం ఎమ్మెల్యేతో ఫోన్ చేయించి తన బదిలీని నిలుపుదల చేయించుకొని ఎల్ఎన్‌పేటకు పోస్టింగ్ వేయించుకున్నారు. కలెక్టరేట్ హెచ్ సెక్షన్‌కి మెళియాపుట్టి నుంచి హనుమంతురావుని నియమించారు. ఆయన కూడా ఎమ్మెల్యేని కలిసి కలెక్టరేట్ రాకుండా నిలుపుదల చేయించుకుని ఎల్ఎన్‌పేటను వేయించుకొన్నారు. ఈశ్వరమ్మను మెళియాపుట్టికి మార్చారు. మళ్లీ ఆమె ఎమ్మెల్యే వద్ద నుంచి ఫోన్ చేయించుకొని తన ఎల్ఎన్‌పేటకు ఉత్తర్వులు తెచ్చుకొన్నారు. హనుమంతురావుని హిరమండలం వేశారు. హిరమండలంలో పనిచేస్తున్న రవిచంద్రని కొత్తూరు వేశారు. ఈశ్వరమ్మను ఎల్ఎన్‌పేటలో ఉంచారు. హెచ్ సెక్షన్‌కి ఇప్పటి వరకు ఎవ్వరినీ వేయలేదు. ఈ మార్పులన్నీ పాతపట్నం ఎమ్మెల్యే ఫోన్ సిఫార్సులు కావడం విశేషం.

ఆశా వర్కర్ల ధర్నా

అరసవల్లి: ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఆశాలకు సంబంధం లేని పనులు చేయించడం ఆపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. టెక్కలి మండలం కె.కొత్తూరు పరిధిలో ఆశా వర్కర్ సరస్వతిని వేధించిన ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాలని, పలాస మండలం కిష్టుపురం ఆశా వర్కర్‌పై అర్ధరాత్రి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, వ్యాక్సిన్ కేరియర్లు ఆశాలతో తీసుకురావడం ఆపాలని, ఫ్రైడే డే సమయంలో ఆశా వర్కర్లతో దోమల మందు వేయించకూడదని, హైరిస్క్ రిఫరల్ కేసులు ఆశాలతో మాత్రమే పంపిస్తున్నారని, పై స్థాయి సిబ్బంది హాజరు కావాలని, 21 రికార్డులు రాయాలని ఒత్తిడి చేస్తున్నారని దీన్ని ఆపాలని, గర్భిణులను ఆస్పత్రికి తీసుకువెళ్లే సమయంలో దారి ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.


డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

జిల్లాలో రిఫైనరీ ఏర్పాటుకు కృషి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రానికి రిఫైనరీ వచ్చిందని, దీన్ని జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన అభిప్రాయ సేకరణకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వనరులు వినియోగించుకుని ప్రగతి పథంలో పయనించాలని తెలిపారు. మూలపేట పోర్టుకు వచ్చే జూన్ 12నాటికి ఒక షిప్ వచ్చేలా ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖపట్నం నుంచి భోగాపురానికి, భోగాపురం నుంచి మూలపేట పోర్టుకు రహదారి ఏర్పాటు చేస్తే తీర ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు భూసేకరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. టెంపుల్ టూరిజానికి సంబంధించి ఒక బస్సు ఏర్పాటు చేసి జిల్లాలో ఉన్న దేవాలయాలను సందర్శించవచ్చన్నారు. బలరాంపురంలో ప్రభుత్వ భూ వివరాలు తీసుకోవాలని డీఎఫ్‌ఓను ఆదేశించారు. జైలు వద్ద గల స్థలంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు భూమిని పరిశీలించాలని జేసీకి సూచించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ వికసిత్ ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్ర - 2047 పై ఇప్పటి వరకు 1.24 లక్షల మంది నుంచి స్పందన వచ్చిందని అభిప్రాయ సేకరణలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ముందంజలో ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా స్థాయి ప్రణాళికలను తయారు చేయాల్సి ఉందన్నారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జలవనరుల ప్రాజెక్టులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేదని, దాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూముల పరిశీలనకు డిప్యూటీ కలెక్టర్‌తో ఒక కమిటీ వేయాలని సూచించారు. శాసన మండలి సభ్యులు నర్తు రామారావు మాట్లాడుతూ జిల్లాలో వలసలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొబ్బరి చెట్లు పడిపోవడంతో ప్రభుత్వం కొబ్బరి మొక్కలు సరఫరా చేయాలని కోరారు. వర్క్‌షాప్‌లో ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, కూన రవి కుమార్, నడికుదిటి ఈశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

పురుగు మందు తాగి గిరిజనుడి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని మేఘవరం పంచాయతీ పరిధి జక్కరపేట గ్రామానికి చెందిన పాత్రపురం మంగులు(60) అనే గిరిజనుడు పురుగుల మందు తాగి శుక్రవారం మృతి చెందారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. మృతుడు మంగులు గత కొంత కాలంగా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారు. సమస్యలు ఎక్కువ కావడంతో శుక్రవారం తన ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగేశారు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. 108లో వెళ్తుండగా కోటబొమ్మాళి దాటిన తర్వాత ఆయన మృతిచెందారు. అనంతరం మృతదేహాన్ని నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై టెక్కలి సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


ఆస్పత్రిలో మంగులు

ఫిబ్రవరి 6 నుంచి
ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమైనదని, అలాంటి యువత పాలకుల నిర్లక్ష్య ధోరణితో సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోందని, సమస్యల పరిష్కారానికి వేదికగా శ్రీకాకుళం జిల్లా కానుందని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మాజీ జాతీయ కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర 22 వ మహాసభను శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6,7,8,9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ సమావేశాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి.రాజేంద్రబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ పోరాటాల పురిటిగడ్డ అయిన శ్రీకాకుళంలో ఈ మహాసభలు నిర్వహించడం చారిత్రాత్మకమవుతుందన్నారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా పాలకులు ప్రణాళికలు రూపొందించాలని, ముఖ్యంగా యువత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు, సీపీఐ శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, కూరంగి మన్మధరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా కా ర్యదర్శి కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు జి.వాసు, మాజీ జిల్లా అధ్యక్షులు చింతాడ కృష్ణారావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం, సీపీఐ, యువజన, కార్మిక, విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అందని ద్రాక్షే


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉచిత ఇసుక విధానంపై నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఏడురోడ్ల కూడలి వద్ద ప్రభుత్వ ఇసుక విధానానికి వ్యతిరేకంగా ఇసుకను కేజీల రూపంలో అమ్ముతూ వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా నేటికీ ఉచిత ఇసుక అందని ద్రాక్షగానే ఉందని విమర్శించారు. ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న లారీల యాజమానులపై కేసులు నమోదు చేయవద్దంటూ ప్రజా ప్రతినిధులు హుకుం జారీ చేస్తున్నారని, ఈ పద్ధతి మానుకోవాలని ప్రభుత్వానికి హితవుపలికారు.

టెక్కలిలో..

టెక్కలి: కూటమి ప్రభుత్వ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఉచిత ఇసుక హామీను తక్షణమే అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం టెక్కలి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కె.ఎల్లయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సరైన పనులు లేక పస్తులుంటున్నారని అన్నారు. తక్షణమే ఉచిత ఇసుక హామీను అమలు చేయాలని తహసీల్దారు కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

అర్ధరాత్రి కత్తితో హల్‌చల్

కాశీబుగ్గ: పదమూడేళ్ల బాలుడు ఓ షాపులో దొంగతనం చేసిన సీసీ పుటేజీ చూసి పోలీసులు ఆశ్చర్యపోయారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని వెంకటపద్మా కాష్యూ షాప్‌లో గురువారం అర్ధరాత్రి దొంగతనం చోటు చేసుకుంది. షాపు వెనుకభాగం నుంచి తలుపులు పగలగొట్టి షాప్‌లోకి ప్రవేశించిన ఓ బాలుడు షాపులో అన్నీ వెతికి పడేశాడు. కత్తి చేతపట్టుకుని హల్‌చల్ చేశాడు. డెస్క్‌లో రూ.5వేలు మాత్రమే దొరకడంతో దాన్ని తీసుకుపోయాడు. ఇవన్నీ సీసీ కెమెరాలో నిక్షిప్తం కావడంతో కాశీబుగ్గ పోలీసులు బాలుడిని అరెస్టు చేశారు.